# నేడు తుంగతుర్తిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రారంభం


తుంగతుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం

తుంగతుర్తి, అక్టోబర్ 3 : గడిచిన 40 ఏండ్లుగా తుంగతుర్తి ఎమ్మెల్యేలుగా ఎంతోమంది పదవులు చేపట్టినప్పటికీ నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యేకు ప్రత్యేకమైన వసతి గృహం, క్యాంప్ కార్యాలయం లేదు. అటువంటి ప్రయత్నాలు కూడా జరుగలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం తుంగతుర్తి నుంచి యువ నాయకుడు గాదరి కిశోర్‌కుమార్‌కు ఉద్యమ నాయకుడు కేసీఆర్ అవకాశం ఇవ్వడంతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. దాంతో నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేకంగా ఒక క్యాంప్ కార్యాలయం ఉండాలనే లక్ష్యంతో కోటి రూపాయల నిధులతో 2018 జూలైలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొదట్లో నిర్మాణ పనులు వేగంగా జరిగినప్పటికీ కొవిడ్ కష్ట కాలంలో పనులు మందగించాయి. అనంతరం పనులు తిరిగి పుంజుకోవడంతో నిర్మాణం పూర్తయింది. రూ.10 లక్షలతో ప్రహరీని నిర్మించారు. భవనాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దీపికాయుగేంధర్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య తెలిపారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం అందుబాటులోకి రావడంపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## క్యాంప్ కార్యాలయం అందుబాటులోకి రావడం సంతోషం



గతంలో ఏ ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలకు ప్రత్యేకంగా వసతి, క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేయలేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో కోటి రూపాయల నిధులు మంజూరు చేశారు. దాంతో నిర్మాణ పనులు వేగంగా చేసి నేడు క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభోత్సవం చేసుకోవడం మనందరి అదృష్టం. నిధుల సహకారం అందించిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– గాదరి కిశోర్‌కుమార్, ఎమ్మెల్యే, తుంగతుర్తి

# మోత్కూరును రెవెన్యూ డివిజన్ చేయాలని వినతి


తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

అడ్డగూడూరు, అక్టోబర్ 3 : మోత్కూరు మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్రు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం తాసీల్దార్ శేషగిరిరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోత్కూరును రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే సూమారు 70 కిలోమీటర్ల దూర భారం తగ్గనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాయల భాస్కర్, గడ్డం సోమన్న, గూడెపు పాండు, అంబటి సమ్మయ్య, పూజారి భిక్షం, ఓర్సు వెంకన్న, లింగయ్య పాల్గొన్నారు.

# 'ఆరోగ్య మహిళ'కు విశేష స్పందన


పరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి

నూతనకల్, అక్టోబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం తీసుకువచ్చిన ఆరోగ్య మహిళ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నది. ప్రతి మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి మహిళలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. మంగళవారం 32 మంది మహిళల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేయగా అనుమానం ఉన్న 12 మందికి చెందిన రక్త శ్యాంపిల్స్‌ను జిల్లా కేంద్రంలోని టీహబ్‌కు పంపించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తారమ్మ, వెంకట్‌రెడ్డి, ఆనంద్, సీతారామ్‌రెడ్డి పాల్గొన్నారు.

# గ్రంథాలయ చైర్మన్ విష్ణుకు సన్మానం


విష్ణును సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ మండల నాయకులు

అడ్డగూడూరు, అక్టోబర్ 3 : అడ్డగూడూరు మండల గ్రంథాలయ చైర్మన్‌గా మండలంలోని కోటమర్తి గ్రామానికి చెందిన పాశం విష్ణు నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం కోటమర్తి గ్రామంలోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దర్శనాల మహేందర్, మందుల మహేశ్, తలపాక శేఖర్, గూడెపు సోమయ్య, బాకీ చంటి, నరేశ్ పాల్గొన్నారు.

# ప్రగతి పథంలో వెలిశాల

పల్లె ప్రగతితో మారిన గ్రామ రూపురేఖలు

గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి

గ్రామస్తుల హర్షం


వెలిశాలలో వేసిన సీసీ రోడ్డు


మిషన్ భగీరథ తాగునీటి ట్యాంక్

తిరుమలగిరి, అక్టోబర్ 3 : మండలంలోని వెలిశాల గ్రామ విస్తీర్ణం 35.2 ఎకరాలు. జనాభా 3,541 మంది. 867 కుటుంబాలు. మొత్తం ఓటర్లు 2,383. స్త్రీలు 1,177, పురుషులు 1,206. గత పాలకుల నిర్లక్ష్యంతో గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నది. సాగునీరు లేక వ్యవసాయం కుంటుపడింది. తాగునీటికి సైతం తిప్పలే. మండే ఎండలోనూ వ్యవసాయ బావులు, చేతి పంపుల కాడికి వెళ్లి భుజాలు కాయలు కాసేలా అవస్థలు పడ్డ రోజులు. రహదారులు, గ్రామాల్లోని వీధులు అధ్వాన్నంగా ఉండేవి. వానకాలం వచ్చిందంటే చాలు వీధులన్నీ చిత్తడిగా మారేవి. డ్రైనేజీ కాల్వలు లేక మురుగు నీరు ఇండ్లముందు నిలిచి ఈగలు, దోమలతో ప్రజలు సహవాసం చేసేవారు.

## స్వరాష్ట్రంలో మారిన రూపురేఖలు..

తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామం రూపురేఖలు మారాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంతో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తుండడంతో గ్రామం అన్ని విధాల ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నది. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుండడంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, బీటీ రోడ్లు, డంపింగ్ యార్డు, వైకుంఠ ధామం, సెగ్రిగేషన్ షెడ్, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం, మిషన్ భగీరథతో ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీరు, 69 డీబీఎం నుంచి ఎస్సారెస్పీ కాల్వల ద్వారా వ్యవసాయ పొలాలకు సాగునీరు అందుతుండడంతో సాగు విస్తీర్ణం పెరిగి పసిడి పంటలు పండుతున్నాయి. నూతన పీహెచ్‌సీ సబ్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు తదితర పనులతో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో కొనసాగుతున్నది.

### ఎమ్మెల్యే కిశోర్ సహకారంతో అభివృద్ధి



పల్లె ప్రగతి ద్వారా గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గ్రామంలో ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని వసతులతో ముందుకు సాగుతున్నాం. తాగునీటి వసతి, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సహకారంతో గ్రామంలో అన్ని వసతులతో అభివృద్ధి పనులు చేశాం.

– ఆకుల వీరయ్య, గ్రామ సర్పంచ్, వెలిశాల

### గ్రామం బాగుపడ్డది



బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాలు బాగుపడ్డాయి. ఇంత అభివృద్ధి ఎప్పుడూ జరుగలేదు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మంచినీళ్ల సౌకర్యం. మురుగు కాల్వల ఏర్పాటు, డంపింగ్ యార్డుల ఏర్పాటు, వ్యవసాయానికి నిరంతర విద్యుత్, రైతు బంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్లు ఇలా అన్ని రకాల అభివృద్ధి జరిగింది.

– తాతరబోయిన మల్లయ్య, గ్రామస్తుడు, వెలిశాల

### గ్రామంలో అభివృద్ధి పనులు..

- అన్ని రకాల ఆసరా పెన్షన్లు 477 మందికి రూ.10,61,632
- రైతు బంధు 856 మంది రైతులకు రూ.7,31,04,717
- రైతు బీమా 16 మందికి రూ.80 లక్షలు
- రైతు రుణ మాఫి 541 మందికి రూ.2,23,92,069
- వ్యవసాయ యాంత్రీకరణ రూ.30 వేలు
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ 105 మందికి రూ.93,46,020
- కేసీఆర్ కిట్ 77 మందికి రూ. 9,61,000
- సీఎం సహాయ నిధి 8 మందికి రూ.2,78,000
- దళిత బంధు 106 మందికి రూ.10.60 కోట్లు
- మన ఊరు–మన బడి పనులకు రూ.56 లక్షలు
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ రోడ్ల నిర్మాణానికి రూ.35 లక్షలు
- ఎస్‌డీఎఫ్ సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15 లక్షలు
- బీటీ రోడ్డు నిర్మాణానికి రూ 3.70 కోట్లు
- విద్యుత్ నిర్మాణ పనులకు రూ.4 లక్షలు
- మిషన్ కాకతీయ పనులకు రూ. 2,50,90,000
- హరితహారం రూ.5.62 లక్షలు
- వైకుంఠ ధామం రూ.12.60 లక్షలు
- డంపింగ్‌యార్డుల నిర్మాణం రూ.2.50 లక్షలు
- వ్యక్తిగత మరుగుదొడ్లు 178 రూ.21.36 లక్షలు
- 660 నల్లా కనెక్షన్లు
- సబ్సిడీ గొర్రెల పంపిణీ 67మందికి రూ.64.99 లక్షలు
- సబ్సిడీ బర్రెలు పంపిణీ 12 మందికి రూ.9.60 లక్షలు
- సబ్సిడీపై చేప పిల్లల పంపిణీ రూ.2,35,351
- 32 స్వయం సహాయక సంఘాలకు రుణాలు చెల్లింపు రూ. 1 కోటి
- వరిసాగు 827 ఎకరాలు
- పత్తి సాగు 243 ఎకరాలు
- ఇతర పంటలు 90 ఎకరాలు
- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 208
- ట్రాన్స్‌ఫార్మర్లు 63
- గృహ విద్యుత్ కనెక్షన్లు 444
- రైతులు 766 మంది ఉన్నారు.

## వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీ

అర్వపల్లి, అక్టోబర్ 3 : మండలంలోని కొమ్మాల గ్రామంలో గల వేణుగోపాల స్వామి ఆలయంలో చోరీ జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బతుకమ్మ పండుగ సమీపిస్తుండడంతో మంగళవారం స్థానికులు కొందరు గుడి ఆవరణను శుభ్రం చేయడం కోసం దేవాలయానికి వెళ్లడంతో చోరీ విషయం వెలుగు చూసింది. హనుమంత, గరుఢ, అశ్వ వాహనాలు, నాగశేషు, ఇత్తడి విగ్రహాలు చోరీకి గురయ్యాయి. సంఘటన స్థలాన్ని సర్పంచ్ గంగాధరి వెంకటమ్మావెంకటయ్య, ఉప సర్పంచ్ కుంట్ల రేణుకాగోవర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కుక్కడపు సైదులు పరిశీలించారు. అనంతరం పూజారి దరూరి జగన్నాథచార్యులు అర్వపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## నేడు అర్వపల్లి మండల సర్వసభ్య సమావేశం

అర్వపల్లి, అక్టోబర్ 3 : అర్వపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం జరుగనున్నట్లు ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యాయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

## చెరువు కట్టపై కంపచెట్ల తొలగింపు

అర్వపల్లి, అక్టోబర్ 3 : మండలంలోని కోమటిపల్లి గ్రామంలో గల చౌటచెరువు కట్టపై దట్టంగా అల్లుకున్న కంప చెట్లను జేసీబీ సాయంతో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు కట్టపై నుంచి సుమారు 100 మంది రైతులు నిత్యం వ్యవసాయ పొలాలకు వెళ్తుంటారని, దట్టంగా పెరిగిన కంపచెట్లతో ఇబ్బందులు పడుతుండడంతో తొలగించినట్లు వెల్లడించారు.

## నేడు మోత్కూరుకు ఎమ్మెల్యే కిశోర్ రాక

మోత్కూరు, అక్టోబర్ 3 : ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ బుధవారం మోత్కూరు మండల పర్యటనకు వస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటన సందర్భంగా మధ్యాహ్నం మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్‌బాపుజీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. అనంతరం మండలంలోని పొడిచేడులో సీసీ రోడ్డు పనుల ప్రారంభం, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి, కురుమ, వడ్డెర కుల సంఘాలకు మంజూరు చేసిన కమ్యూనిటీ హాల్ భవన సముదాయాలకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

## పరామర్శ

మోత్కూరు, అక్టోబర్ 3 : మండలంలోని దత్తప్పగూడేనికి చెందిన గొలుసుల అంతయ్య (68) అనారోగ్యంతో మృతిచెందారు. మృతదేహాన్ని మంగళవారం సర్పంచ్ ఎలుగు శోభాసోమయ్య సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి సహకారంతో రూ.5 వేలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి ఎలుగు యాదయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్కే సాజీద్, నాయకులు పాల్గొన్నారు.